



సొంత జిల్లాకు నిధులిచ్చేరా..?

బడ్జెట్-2025

◆ నేడు రాష్ట్ర బడ్జెట్
◆ ఆర్థిక మంత్రిపై ఉమ్మడి జిల్లా ఆశలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రెండవసారి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. శుక్రవారం నాడు అసెంబ్లీలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఇప్పటికే బడ్జెట్ కూర్పును పూర్తి చేశ్వారు. శుక్రవారం జరిగే అసెంబ్లీ సమావేశంలో ఆయన రెండవసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. మూడు మాసాల క్రితం తొలిసారిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్‌ను రెండవసారి ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాపై ఏ మేరకు ప్రేమను కనబరుస్తారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కేశవ్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవం, అనంత జిల్లా పరిస్థితులపై పూర్తిస్థాయి అవగాహనుంది. ఈ నేపథ్యంలో ఇక్కడి ముఖ్యమైన సమస్యలకు బడ్జెట్ ద్వారా ఏ విధంగా పరిష్కారం చూపించే ప్రయత్నం చేస్తారన్నది చూడాల్సి ఉంది.

సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత లభించాలి

అనంతపురం జిల్లా అంటూనే నిత్యం కరువులకు నిలయం. ఇటువంటి చోట్ల సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యత చాలా ఉంది. ఇంత వరకు ఇక్కడి సాగునీటి ప్రాజెక్టులకు తగినంత ప్రాధాన్యత లభించలేదన్న విమర్శ ఉంది. ఈ విషయాలు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడా స్పష్టమైన అవగాహనుంది. జిల్లాకు ఏకైక నిఖర జలాలున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి రోజురోజుకు తీసికట్టుగా మారుతోంది. నీరు తుంగభద్ర డ్యామ్‌లో పుష్కలంగా ఉన్నా జిల్లాకు తెచ్చుకోలేకపోతున్నాం. ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ మధ్యలోనే అటకెక్కింది. తక్షణం దీన్ని ఆధునీకరించాల్సి ఉంది. ఈ ఆధునీకరణకు బడ్జెట్‌లో ఏ మేరకు ప్రాధాన్యత లభిస్తుందన్నది చూడాల్సి ఉంది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ సొంత నియోజకవర్గంలో ఉన్న పిఎబిఆర్ పూర్తయి నాలుగుదశాబ్ధాలు గడుస్తున్నా పూర్తి సామర్థ్యంతో నింపలేకపోతున్నారు. ఇప్పటికీ నాలుగు వేల ఎకరాల వరకు భూసేకరణ జరగాల్సి ఉంది. మరమ్మతులకు జియోమెంబ్రైన్ పద్ధతుల్లో చేపట్టాలి. ఇందుకు నిధులు అవసరమవుతాయి. హంద్రీనీవా మరో ప్రధాన ప్రాజెక్టుగా ఉంది. ఈ ప్రాజెక్టు మొదటి బడ్జెట్‌లోనే నిధులు కేటాయించినప్పటికీ దీనిపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జిల్లావాసులు మొదటి, రెండో దశలో కాలువల వెడల్పు కోరుతుంటే ప్రభుత్వం రెండో దశలో లైనింగ్‌కు నిధులిచ్చింది. లైనింగ్ చేయడం ద్వారా భూగర్భజలాలు తగ్గిపోయి నష్టపోతామని రైతులు వాపోతున్నారు. దీనికి వ్యతిరేకంగా నిరసనలూ చేపడుతున్నారు. మొదటి విడత కాలువ వెడల్పునకు ఎటువంటి చర్యలు ఈ బడ్జెట్‌లో తీసుకోనున్నారన్నది చూడాల్సి ఉంది.

తాగునీటి ప్రాజెక్టుల పరిస్థితీ దయనీయమే

ఉమ్మడి జిల్లాలో తాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. ఉమ్మడి జిల్లాకు తాగునీటి అందించే వాటిల్లో ప్రధానంగా ఉన్నది సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్టులు. సత్యసాయి ప్రాజెక్టు ఎప్పుడో నిర్మించగా ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీనికి తరచూ మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో నీటి సరిఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఇక కార్మికుల వేతనాలకు ఎప్పుడూ ఇబ్బందులు తలెత్తుతూనే ఉన్నాయి. దీనికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సి ఉంది. సాధారణ నిర్వహణ నిధుల నుంచి ఇస్తుండటంతో ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. వీటికి బడ్జెట్‌లో ఏ రకమైన పరిష్కారాలు చూపనున్నారనది చూడాల్సి ఉంది.

ఇవి కూడా....

సాగు, తాగునీరు కాకుండా రైతాంగ సమస్యలు అనేకమున్నాయి. గిట్టుబాటు ధరల్లేవు. ఉద్యానవనానికి ఊతమిస్తామన్న ప్రకటనలు మినహా చర్యలేవీ ఉండటం లేదు. సబ్సిడీలు పెంచాలని, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని జిల్లావాసులు కోరుతున్నారు. వీటన్నింటికీ బడ్జెట్ కేటాయింపుల్లో అనంతపురం జిల్లాకు ఏ విధమైన సహాయ సహకారాలను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అందించనున్నారన్నది చూడాల్సి ఉంది.

కూలిన రైతు కష్టం..!

అరటి రైతులు పంట సాగుకోసం ఆరుగాలం శ్రమించారు. పెట్టుబడులు, ఎరువులు, కూలీల ఖర్చులతో కలిపి లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో మొక్కలు నేలవాలిపోవడంతో అన్నదాతల ఆశలు కళ్లేదుటే కూలిపోయాయి. ఒకటి కాదు రెండు కాదు సాగు చేసిన పంట మొత్తం కూలిపోవడంతో రైతులకు కన్నీరే దిక్కయ్యింది. ఓ ప్రయివేటు కంపెనీ నుంచి తీసుకున్న అరటి పిలకలు బాగోలేకనే ఇలా చెట్లన్నీ కూలిపోయాయంటూ యల్లనూరు మండలం ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ 'కిసాన్ అగ్రిబయోటెక్' పిలకలు నాటిన రైతులు
◆ కాత సమయంలో పడిపోయిన చెట్లు
◆ కంపెనీ మోసం అంటూ అన్నదాత ఆవేదన
◆ న్యాయం చేయాలంటూ వేడుకోలు


ప్రజాశక్తి-యల్లనూరు

యల్లనూరు మండల పరిధిలోని ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు హైదరాబాద్‌కు చెందిన కిసాన్ అగ్రి బయోటెక్ సంస్థకు చెందిన అరటి పిలకలను 10 నెలల క్రితం సాగు చేశారు. ఇదే గ్రామానికి చెందిన వెంకట రమణ కిసాన్ అగ్రి బయోటెక్ ఏజెంట్‌గా ఉంటూ అరటి పిలకలను విక్రయించారు. ఈయన ద్వారా సుమారు సుమారు 90వేల అరటి పిలకలను గ్రామ రైతులు కొనుగోలు చేసి పొలాల్లో నాటారు. గ్రామంలోని 10 నుంచి 12 మంది రైతులు దాదాపు 80 ఎకరాల్లో ఈ కంపెనీ మొక్కలను నాటారు. ఒక్కో రైతు సాగు విస్తీర్ణం బట్టి 3000 నుంచి 10వేల వరకు అరటి పిలకలను సాగు చేశారు. మొదట్లో మంచి నాణ్యతగా అరటి చెట్లు పెరిగాయి. అరటి గెల ఏర్పడే క్రమంలో ఒక్కసారిగా చెట్టు వేర్లు నల్లగా మారి కూలిపోతున్నాయి. ముందుగా గాలికి కూలిపోతున్నాయని భావించిన రైతులు చెట్లు కిందకు వాలిపోకుండా కర్రలను అడ్డుగా ఏర్పాటు చేశారు. రానురానూ చెట్లు మొత్తం కూలిపోవడంతో మొక్కలోనే లోపం ఉందని గ్రహించి సంబంధిత కిసాన్ బయోటెక్ ఏజెంట్‌ను సంప్రదించారు. ఆయన కూడా పరిశీలించి విషయాన్ని కంపెనీ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే వారి నుంచి సరైన స్పందన రాలేదు. కనీసం కూలిపోతున్న చెట్లను పరిశీలించేందుకు కూడా కంపెనీ ప్రతినిధులెవరూ గ్రామానికి రాలేదు. దీంతో మోసపోయామని భావించిన రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించారు. స్పందించిన వ్యవసాయ అధికారులు కూలిపోయిన అరటిచెట్లను పరిశీలించారు. ఇవి ఎందుకు కూలిపోతున్నాయి..? ఎక్కడ లోపం ఉందన్న దానిపై వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా పరిశీలించేందుకు మొక్కల నమూనాలను సేకరించారు. ప్రస్తుతం అరటి కాయలకు ధర ఆశాజనకంగా ఉంది. ఇలాంటి సమయంలో చేతికొచ్చిన పంట ఇలా కళ్లేదుటే కూలిపోవడంతో రైతులు కన్నీటి పర్యవంతం అవుతున్నారు. నాశిరకం పిలకలను తమకు విక్రయించి మోసం చేసిన కిసాన్ అగ్రి బయోటెక్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

నేలకొరిగిన అరటిచెట్లు



రూ.40 లక్షలు నష్టం



ఐదు ఎకరాల్లో 10 వేల కిసాన్ అగ్రి బయోటెక్ అరటి పిలకలు నాటాను. ఇందుకోసం రూ.15లక్షలు ఖర్చు అయ్యింది. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. ఉన్న ఫలంగా ఏరు సాంద్రత లేక అరటి చెట్లన్నీ నేలకొరిగాయి. సుమారు రూ.40 లక్షలు నష్టం వాటిల్లింది.

శంకర్ నాయుడు, రైతు,
ఎస్.కొత్తపల్లి గ్రామం.

ప్రభుత్వమే ఆదుకోవాలి



6 వేల అగ్రి బయోటెక్ అరటి పిలకలు నాటాను. ఇందుకోసం దాదాపు రూ.6లక్షలు ఖర్చు అయ్యింది. ప్రస్తుతం అరటికి మంచి ధర ఉండడం, పంట కూడా బాగా రావడంతో రూ.10 నుంచి రూ.12లక్షలు వస్తుందనుకున్నాను. కోత సమయంలో సమయంలో అరటి చెట్లు నెలకొరిగాయి. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

రమేష్ నాయుడు, రైతు
ఎస్.కొత్తపల్లి గ్రామం.

పడిపోయిన చెట్లను పరిశీలించాం

ఎస్.కొత్తపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన అరటి చెట్లను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. కాత సమయంలో చెట్లన్నీ నేలకొరిగాయి. అక్కడ మట్టితో పాటు నేల సాంద్రత, తదితర అంశాలపై నమూనాలను సేకరించి వ్యవసాయ శాస్త్ర వేత్తలకు పంపాం. వారి నివేదిక ఆధారంగా తదుపరి కంపెనీపై చర్యలు తీసుకుంటాం.

హెచ్.నరసింహ,
జిల్లా ఉద్యానవన డిడి.



రాళ్లను తొలగించాలని కోరుతున్న కెవిపిఎస్, ప్రజాసంఘాల నాయకులు

అంబేద్కర్ స్మారక భవనం స్థలంలో రాళ్లను తొలగించండి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న సర్వే నంబరు 539-2, 540-2లో ఉన్న 71 సెంట్ల స్థలాన్ని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్మారక భవనానికి కేటాయించాలని కోరుతున్న స్థలంలో ఉన్న రాళ్లను తొలగించాలని సిపిఎం, కెవిపిఎస్, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ అంబేద్కర్ స్మారక భవనంకు కేటాయించిన స్థలాన్ని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని, అధికారులు దీనిని అడ్డుకోవాలని కోరారు. అనంతరం అధికారులను కలిసి రాళ్లను తొలగించాలని కోరారు. ఈ విషయంపై తహశీల్దార్ పుణ్యవతి, సిఐ కరుణాకరన్ స్పందించి స్థలంలో ఉన్న రాళ్లను తొలగించేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ఛైర్మన్ బిసిఆర్.దాసు, ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు సాకే హరి, ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్న ఆంజనేయులు, వరికూటి కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

ర్యాపిడోను నిరోధిస్తేనే కార్మికులకు ఉపాధి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ర్యాపిడోను నిరోధిస్తేనే ఆటో కార్మికులకు ఉపాధి ఉంటుందని భగత్‌సింగ్ ఆటోయూనియన్ నాయకులు తెలిపారు. ర్యాపిడో నియంత్రణ, ఆటో డ్రైవర్ల సమస్యలపై సిఐటియు భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌ను గురువారం కలిసి విన్నవించారు. ర్యాపిడోను పూర్తిగా నిషేధించాలన్నారు. ప్రయివేటు ఫైనాన్స్‌ల ఒత్తిళ్లను తగ్గిస్తూ, ప్రభుత్వ బ్యాంకుల్లో రుణాలు ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శులు వెంకట్ నారాయణ, ముర్తుజా, భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నగర కార్యదర్శులు ఎన్టీఆర్ శ్రీనివాసులు ఆదినారాయణ, అధ్యక్షులు నాగరాజు, రాజం, బాషా పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో 'సైన్స్ ఎక్స్‌పో'

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీచైతన్య బాలిక రెసిడెన్షియల్ పాఠశాలలో గురు వారం 'సైన్స్ ఎక్స్ పో' ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎజిఎం సుబ్బారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సాంకేతికత, వైజ్ఞానిక అంశాల పట్ల విద్యార్థి దశ నుంచే మక్కువ కల్పించాలనే ఉద్దేశ్యంతో 'సైన్స్ ఎక్స్ పో' ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను పెంపొందించే దిశగా ఈ వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతా యన్నారు. ఇందులో ప్రదర్శించిన 200 రకాల వైజ్ఞానిక నమూనాలు, చిన్నారులు వాటి గురించి వివరించిన తీరు చూపరులను అబ్బురపరిచాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సమీనాఖాన్, జోనల్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్ సత్యనారాయణ, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి చంద్రమోహన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

డంపింగ్ యార్డ్‌ను తరలించండి

సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర, నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాజీవ్ కాలనీ ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా మారి, అనారోగ్య సమస్యలకు కారణం అవుతున్న డంపింగ్‌యార్డును ఆ ప్రాంతం నుంచి తరలించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. డంపింగ్‌యార్డును తరలించాలని కోరుతూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం నాడు రాజీవ్ కాలనీలో పాదయాత్ర, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడుతూ నగరంలోని ప్రజలతోపాటు, రాజీవ్ కాలనీ పంచాయతీ ప్రజలు డంపింగ్‌యార్డు వల్ల తీవ్రమైన కలుషితమైన గాలి దుర్వాసన పీల్చి అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు ఎన్ని వచ్చినా ఈ సమస్య పరిష్కారానిని నోచుకోవడం లేదన్నారు. డంపింగ్ యార్డ్ నుంచి విపరీతమైన పొగ రావడంతో రాజీవ్ కాలనీ ప్రజలు అనారోగ్యాల పాలై ఆసుపత్రుల పాలవుతున్నా పాలకుల్లో చలనం లేకపోవడం విచారకరం అన్నారు. తక్షణం దీనిని రాజీవ్‌కాలనీ నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. సర్పంచి ఆశాబీ మాట్లాడుతూ డంపింగ్‌యార్డు నుంచి విపరీతమైన మంటలతో పొగ వ్యాపించడం కాలనీ ప్రజలందరూ ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. టిడిపి నాయకులు రసూల్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ విషయంపై పార్టీలకతీతంగా అందరూ కలిసి ముందుకెళ్లి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంపై తాము అర్బన్ ఎమ్మెల్యేతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఖాజా మాట్లాడుతూ రామయ్య కాలనీకి పక్కనే డంపింగ్ యార్డ్ ఉండడం చేత రాత్రింబవళు విషపు గాలిని పీల్చుకొని అనారోగ్యం పాలవుతున్నారని దీనిని పూర్తిగా ఇక్కడి నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ఆర్‌వి.నాయుడు, ముర్తుజ, రాజీవ్ కాలనీ మాజీ సర్పంచి హుస్సేన్, ఉప సర్పంచి మసూద్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు వలీ, నగర కమిటీ సభ్యులు ఎన్టీఆర్ శీన, వెంకట, రాజు, వెంకటేశు, గపూరు, జీవ, లతీఫ్, కాలనీవాసులు డేవిడ్, చిదంబరయ్య, బిఎస్ఎన్ఎల్ బాషా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రను ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ఇళ్ల పట్టాలు, క్రమబద్ధీకరణకు వినతి

రాయదుర్గం : ప్రభుత్వ లేఔట్లు, అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు నిర్మించుకున్న వారికి ఇళ్లను క్రమబద్ధీకరణ చేయాలని, ఖాళీ స్థలాల్లో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టిన వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ గురువారం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ నాగరాజుకు వినతి పత్రం ఇచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున, పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, తిమ్మరాజు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఖాళీ స్థలాల్లో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టిన వారికి ఇళ్లను క్రమబద్ధీకరణ చేయాలని, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. నిబంధనల మేరకు ప్రభుత్వ ఖాళీ స్థలాలు, అభ్యంతరం లేని స్థలాల్లో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టిన వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేసుకోవడానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

పిల్లల్లో శాస్త్రీయ అవగాహనపై నేడు సదస్సు

అనంతపురం కలెక్టరేట్ : జెవివి నగర కమిటీ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం, జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నాడు రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్‌లో 'పిల్లల్లో శాస్త్రీయ అవగాహన'పై సదస్సును నిర్వహిస్తున్నట్లు జెవివి నగర అధ్యక్షులు ముక్కర రామిరెడ్డి తెలియజేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం అయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకట నాయుడు హాజరవుతారన్నారు. ఆయనతో పాటు వక్తలుగా కార్డియాలజిస్ట్ డా॥ఎం.వంశీకృష్ణ. మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డా॥ఎం.గేయానంద్ హాజరవుతారన్నారు.

నేడు ఉమర్ ఆలీషా జయంతి వేడుకలు

అనంతకు విచ్చేస్తున్న పీఠాధిపతులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మహా కవి, గొప్ప తాత్వికుడు, అవధాని, పార్లమెంటు సభ్యులు, బహుగ్రంథకర్తగా చిరస్మరణీయ సేవలందించిన డాక్టర్ ఉమర్ ఆలీషా జయంతి రాష్ట్రస్థాయి వేడుకలు శుక్రవారం 'అనంత' వేదికగా జరుగనున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు లలితకళాపరిషత్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. డాక్టర్ ఉమర్ ఆలీషా రచించిన కావ్యాలు, నాటకాలతో ప్రజా చైతన్యం తెచ్చారు. ఆయన 140వ జయంతి వేడుకలను డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు లలితకళాపరిషత్‌లో నిర్వహిస్తున్నారు. కవిపండితుడు డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి అధ్యక్షతన జరిగే వేడుకల్లో ముఖ్య అతిథిగా శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం ప్రస్తుత పీఠాధిపతులు డాక్టర్ ఉమర్ ఆలీషా అనంత సదస్సుకు రానున్నారు. 'భారతదేశం- మతసామరస్యం' అనే అంశంపై ఆయన మాట్లాడుతారు. ఈయనతో పాటు జడ్పీ ఛైర్మన్ బోయగిరిజమ్మ, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ రమేష్‌నారాయణ తదితరులు పాల్గొని మాట్లాడతారు. ఈ కార్యక్రమంలో సాహితీ ప్రియులందరూ భాగస్వాములు కావాలని కార్యక్రమ నిర్వాహకులు చింత వెంకటేశ్వర్లు, రియాజుద్దీన్, తోట నాగరాజు, శ్రీహరిమూర్తి, సుంకర రమేష్, చెట్ల ఈరన్న కోరారు.

నగరపాలక సంస్థ ఎస్ఈగా చంద్రశేఖర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



నగరపాలక సంస్థ నూతన సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా బి.చంద్రశేఖర్‌ను నియమిస్తూ గురువారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూర్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను ఉద్యోగోన్నతిపై ఇక్కడికి బదిలీ చేశారు. ఈయన 2007లో అనంతపురం నగరపాలకసంస్థలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేశారు. ప్రస్తుత ఎస్ఈ వి.భాస్కర్‌రావు వలంటరీ రిటైర్మెంట్ స్కీంలో భాగంగా శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో ఆ స్థానంలో ఉద్యోగోన్నతిపై బి.చంద్రశేఖర్‌ను ఎస్‌గా నియమించారు. చిత్తూరులో సిఎం చంద్రబాబు పర్యటన దృష్ట్యా చంద్రశేఖర్ రెండు రోజుల్లో మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

బీడీ కార్మికులకు కూలి రేట్లు పెంచాలి : సిఐటియు


ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తాడిపత్రి పట్టణంలోని బీడీ కార్మికులకు కూలి రేట్లు రూ.200 నుంచి రూ.300 వరకు పెంచాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో అనంతపురం కార్మిక సంక్షేమ శాఖ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ తాడిపత్రి పట్టణంలో తరతరాలుగా బీడీ కార్మికులు అదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో బీడీ కార్మికులకు కూలి రేట్లు పెంచాలన్నారు. వెయ్యి బీడీలకు రూ.200 మాత్రమే ఇస్తున్నారని, రూ.300 ఇవ్వాలన్నారు. ఈశ్రమ్ కార్డు జారీలో బీడీ మేకర్ అని కాకుండా బీడీ వర్కర్‌గా నమోదు చేయాలన్నారు. బీడీ కార్మికులకు పిఎఫ్ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. బీడీ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు పెంచి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి యస్.నాగేంద్ర కుమార్ ఉమ గౌడ్, రామకృష్ణ పాల్గొన్నారు.

మందుల కొరత రానీయొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు అవసరమైన డ్రగ్స్, సర్జికల్స్ ఖచ్చితంగా అందుబాటులో ఉంచాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. గురువారం అనంతపురం నగరంలోని శారద నగర్‌లో ఉన్న ఏపీఎంఎస్ఐడిసి సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన మందుల సరఫరాలో ఎలాంటి లోటు ఉండరాదన్నారు. సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ నుంచి సమయానికి మందులు రాలేదు అనేది ఎక్కడా రాకూడదన్నారు. సరిగ్గా పనిచేయని ఫార్మాసిస్టులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డ్రగ్స్ ఎడి రమేష్‌రెడ్డి, డిఎంహెచ్ఓ డా॥ఈబి.దేవి, డిసిహెచ్ఎస్ డా॥పాల్ రవికుమార్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

మార్చి 25కు ప్లాంటేషన్ పూర్తి కావాలి

నగరంలో మార్చి 25వ తేదీనాటికి ప్లాంటేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్.సి.ఎ.పి)పై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో చేపడుతున్న వివిధ సిసి, బిటి రోడ్ల అభివద్ధి పనుల మధ్య ప్లాంటేషన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ బాలరాజు పాల్గొన్నారు.


బాల్య వివాహాలను అరికట్టాలి

జిల్లాలో బాల్య వివాహాలు ఒక్కటి కూడా జరగకుండా అరికట్టాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి కౌమార బాలికల సాధికారత, బాల్య వివాహాల నిషేధం కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

చుక్కనీటినీ వృథాకానీయొద్దు

వేసవిలో తాగునీటి ఎద్దని దృష్టిలో ఉంచుకుని చుక్కనీరు కూడా వృథా కానీయకుండా ప్రజలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆల్ ఇండియా రేడియో స్టేషన్‌లో గురువారం ఉదయం ఆకాశవాణి అనంత మిత్ర ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో తాగునీటి సమస్యలపై ప్రజలతో నేరుగా మాట్లాడారు.

పకడ్బందీగా భూ రీసర్వే



పెద్దపప్పూరు మండలంలో భూ రీ సర్వేను పరిశీలిస్తున్న జెసి శివనారాయణశర్మ

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలంలోని చిన్నఎక్కలూరు రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ అధికారులు చేపట్టిన భూ రీ సర్వేను గురువారం జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ పరిశీలించారు. జెసి ముందుగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం చిన్న ఎక్కలూరు రెవెన్యూ గ్రామం వెళ్లి అక్కడ జరుగుతున్న రీసర్వే తీరును పరిశీలించారు. జెసి మాట్లాడుతూ ఎవరి భూములు రీ సర్వే చేస్తారో ఆ రైతులకు ముందుగానే తప్పనిసరిగా సమాచారం ఇచ్చి వారు ఖచ్చితంగా రీసర్వేకు హాజరయ్యేలా చూడాలన్నారు. సంబంధిత రైతుల సమక్షంలోనే రీసర్వే చేయాలన్నారు. అలాగే రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఏ ఒక్క రైతుకీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా సక్రమంగా రీ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. జెసి వెంట తహశీల్దార్ బాలాజీరాజ్, సర్వే డిప్యూటీ తహశీల్దార్ రాజ్‌కుమార్, ఆర్ఐ ప్రసన్న, వీఆర్వో ప్రసాద్ కిషోర్, మండల సర్వేయర్ రామ్మోహన్, విలేజ్ సర్వేయర్లు రాజేష్, శోభా, స్వామి, రైతులు ఉన్నారు.

గుత్తి : భూముల రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జెసి శివనారాయణ్‌శర్మ ఆదేశించారు. మండలంలోని శ్రీపురం గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే ప్రక్రియను జెసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా భూ రీసర్వే చేపట్టాలన్నారు. ఆయన వెంట తహశీల్దార్ డి.ఓబిలేసు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ శ్రీలత, మండల సర్వేయర్ ప్రసాద్, వీఆర్వోలు పవన్, టి.సురేంద్ర, పవన్, రాజేష్, శివారెడ్డి ఉన్నారు.

యాడికి : మండలంలోని చందన గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను జెసి శివనారాయణశర్మ, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి రూప్లానాయక్ పరిశీలించారు. జెసి రైతుల సమస్యలపై చర్చించారు. అనంతరం రీసర్వే ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బందికి రైతుల సమక్షంలోనే సూచనలు చేశారు. వారి వెంట తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ రాజ్‌కుమార్, మండల డిప్యూటీ సర్వేయర్ శేషసాయి, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, ఉన్నారు.

కక్ష సాధింపు పాలన

'పోసాని' అరెస్టుపై వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



ప్రజాశక్తి-అనంతపురం

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమవ్వడంతో.. అయితే కక్ష సాధింపులే లక్ష్యంగా అవుతోందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. సినీ నటుడు పోసాని కృష్ణమురళి అరెస్ట్‌పై గురువారం ఆయన స్పందించారు. ఓ రాజకీయ పార్టీ కార్యకర్త ఫిర్యాదు మేరకు కనీసం ప్రాథమిక విచారణ చేయకుండానే పోసానిని అరెస్ట్ చేయడం తగదన్నారు. పాలనలో వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. కక్ష సాధింపుల కోసం కూటమి ప్రభుత్వం వ్యవస్థలను వాడుకుంటోందన్నారు. పోలీసుల తీరుపై హైకోర్టు మొట్టికాయలు వేస్తున్నా మార్పు రాకపోవడం బాధాకరమన్నారు. లోకేష్ రెడ్ బుక్ రాజ్యాం గాన్ని అమలు చేస్తుండగా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పాలనను మరచి ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యారని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు.

అప్రజాస్వామికం : మాజీ ఎమ్మెల్యే



గుంతకల్లు : సినీనటుడు పోసాని కృష్ణమురళిని అక్రమంగా అరెస్టు చేయించడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. రెడ్ బుక్ పాలనలో భాగంగానే ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా పోసానిని అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. వల్లభనేని వంశీని కూడా కక్ష సాధింపులో భాగంగానే అరెస్టు చేసిందని, ఇది సరైంది కాదన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం వైసిపి నేతలు, సానుభూతిపరులపై కక్ష సాధింపు చర్యలు మానుకుని ప్రజారంజక పాలన సాగించాలని లేనిచో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

8న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మార్చి 8వ తేదీ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవ అధికార సమితి ఛైర్పర్సన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం.రమ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజీ కాదగిన క్రిమినల్, సివిల్ కేసులు, కోర్టులో పెండింగ్‌లో ఉన్న, లేని సమస్యలు పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ప్రభుత్వ పథకాలకు అర్హత కలిగి ఉండి లబ్ధి పొందని వారు, రెవెన్యూ సంబంధిత సమస్యలు, బ్యాంకు, చిట్ ఫండ్, మున్సిపాలిటీ, తదితర సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్జి సూచించారు.

విద్యాభివృద్ధికి తోడ్పాటు

ప్రధానోపాధ్యాయుడు మేడా రవీంద్రబాబు



మేడా రవీంద్ర బాబు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పేద విద్యార్థులకు విద్యానందించడమే తన ధ్యేయమని నగరంలో న్యూ టౌన్ ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మేడా రవీంద్రబాబు తెలిపారు. శుక్రవారం ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్య అందాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన తాను ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పని చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. విద్యాభ్యాసం అనంతరం 1989 ఆగష్టు 14న రాయదుర్గంలో ఉపాధ్యాయునిగా మొదట పని చేశానన్నారు. 1990 వరకు ఎస్‌జి అసిస్టెంట్‌గా, 1990 సెప్టెంబర్ నుంచి 1997 నవంబర్ వరకు కళ్యాణదుర్గం గవర్నమెంట్ జూనియర్ కాలేజ్‌లో పని చేశానన్నారు. ఫిబ్రవరి 1995లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందానన్నారు. ప్రభుత్వ హైస్కూల్ నెంబర్–2లో పని చేసిన అనంతరం ఉరవకొండ ఎస్‌కె.గర్ల్స్ హైస్కూల్‌లో జనవరి 2009 నుంచి నవంబర్ 2015 వరకు హెచ్‌ఎంగా పని చేశానన్నారు. అక్కడ మే 2021 వరకు పని చేసి అనంతరం నగరంలోని కొత్తూరు ప్రభుత్వ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో భాగంగా 2014లో ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు అవార్డు వచ్చిందన్నారు. ఉద్యోగ విరమణ చేసినా విద్యాభివృద్ధికి తనవంతు సాయం అందిస్తానని ఆయన తెలిపారు.




సీనియర్ మేనేజర్ రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

ఐఒసి సీనియర్ మేనేజర్‌కు సన్మానం

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

మండలంలోని నక్కలదొడ్డి గ్రామ సమీపంలో ఉన్న ఐఒసి డిపో సీనియర్ మేనేజర్ యుఎస్ ఎస్.రెడ్డి గురువారం ఉద్యోగ విరమణ పొందడంతో ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల చీఫ్ జనరల్ మేనేజర్ పట్నాయక్ మాట్లాడుతూ గుంతకల్లు పట్టణంలో ఉన్న ఐఒసి డిపోను రక్షణ దృష్ట్యా నక్కలదొడ్డి ప్రాంతానికి మార్చడంలో, కార్యాలయ సిబ్బంది, ఐఒసి ట్యాంకర్ల డ్రైవర్ల సంక్షేమానికి రెడ్డి చేసిన సేవలు, కృషిని కొనియాడారు. సిజిఎం, తోటి ఉద్యోగులు రెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐఒసి జిఎంలు హరినాథ్, శర్మ, డిసిఎం చక్రవర్తి, సీనియర్ మేనేజర్ మోహన్, డిఎ ప్రసాద్, లైజనర్ నజీర్‌బాషా, కార్యాలయ సిబ్బంది, ట్యాంకర్ల డ్రైవర్లు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళి



గుత్తిలో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పెన్షనర్స్ సంఘం సభ్యులు

ప్రజాశక్తి-ఉరవకొండ

దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన చంద్రశేఖర్ ఆజాద్ యువతకు స్ఫూర్తి అని ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు నందు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నందు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా ఆజాద్ ఆంగ్లేయుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారన్నారు. ఆజాద్ బాల్యం, విద్య, ఆయన పోరాటాలను వివరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం అలసిపోయేదాకా పోరాడిన ఆయన చివరి క్షణంలో తన వద్ద మిగిలిన ఒకే ఒక్క బుల్లెట్‌తో తనను తానే కాల్చుకుని వీరమరణం పొందారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తరుణ్, వెంకీ, వంశీ, ధనుంజయ, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో ఎపి రాష్ట్ర పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం తాలూకా ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి జెన్నె కుళ్లాయిబాబు, కార్యదర్శి కె.రామ్మోహన్, నాయకులు నారాయణ రెడ్డి, షేక్షావలి, శామ్యూల్, చెన్నారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నారాయణ శెట్టి, దేవదాసు, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో 'శ్రీరామిరెడ్డి' కార్మికులకు వేతనాలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు రెండు నెలల వేతనాలు మంజూరయ్యాయి. ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కళ్యాణదుర్గం పంప్ హౌస్ వద్ద కార్మికులు సమ్మె చేపట్టగా ఈ నెల 18వ తేదీ ఎమ్మెల్యే అధికారులు, గుత్తేదారులతో మాట్లాడారు. దీంతో గుత్తేదారులు స్పందించి ఫేస్–4 పథకంలో పని చేస్తున్న కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల పరిధిలోని 200 మందికి రెండు నెలల వేతనాలను ఖాతాల్లో జమ చేశారు.

మధ్యానేశ్వరస్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్

రాయదుర్గం రూరల్ : మండలంలోని 74–ఉడేగోళం గ్రామంలో వెలసిన మధ్యానేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గురువారం సందర్శించారు. కాలవ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. కాలవ వెంట టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు ఉన్నారు.

మద్యం షాపు, చెక్‌పోస్ట్ తనిఖీ

రాయదుర్గం : డి.హీరేహాల్ మండలంలోని ఓబుళాపురం ఎక్సైజ్ చెక్‌పోస్ట్‌ను గురువారం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి తనిఖీ చేశారు. అలాగే మద్యం షాపును తనిఖీ చేసి నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం రాయదుర్గం ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించి పెండింగ్ కేసులు, కర్నాటక మద్యం, తదితర అంశాలపై చర్చించారు. వారి వెంట ఎక్సైజ్ సిఐ మహేష్‌కుమార్, ఎస్‌ఐ పవన్, సిబ్బంది ఉన్నారు.

తాగునీటి బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వండి..!



విద్యుత్ కనెక్షన్ లేని బోరును చూపిస్తున్న మహిళలు

ప్రజాశక్తి-శింగనమల

ఆర్డీటీ సంస్థ చొరవతో మండలంలోని చక్రాయపేట పంచాయతీకి చెందిన శివపురం ఎస్సీ కాలనీలో బోరు వేసి మోటారు బిగించారు. అయితే మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాగునీటి సమస్య జటిలమైంది. కాలనీ వాసులు తెలిపిన వివరాలు.. కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపో యింది. చివరకు ఆర్డీటీ సంస్థ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన సంస్థ అధికారులు ఎస్సీ కాలనీలో బోరు వేయించి మోటారు సైతం బిగించారన్నారు. ప్రధాన రహదారి పక్కనే త్రీఫేస్ లైన్ ఉందని, రోడ్డు ఇటువైపు కేవలం వంద గజాల దూరంలోని మోటారుకు విద్యుత్ సరఫరా ఇవ్వడానికి అధికారులు మూడు నెలల నుంచి నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. మోటారుకు విద్యుత్ సరఫరా విషయంపై విద్యుత్ శాఖ అధికారులపై సిక్స్ వే రోడ్డు కాంట్రాక్టర్, సిక్స్ వే రోడ్డు కాంట్రాక్టర్‌పై విద్యుత్ అధికారులు చెబుతున్నారన్నారు. దీంతో కిలోమీటర్ దూరం వెళ్లి చెరువు పెద్ద కాలువ నుంచి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని కోనుప్పలపాడు సబ్ స్టేషన్‌లో శుక్రవారం, రాయలచెరువు సబ్‌స్టేషన్‌లో శనివారం విద్యుత్ మరమ్మతులు చేపడతామని ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జి ఏఈ రాజారావు తెలిపారు. కావున ఆయా రోజుల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆర్డీవో జి.వసంతబాబు సందర్శించారు. ఆయన వైద్య సిబ్బంది పనితీరు, వైద్య సదుపాయలు, బిల్డింగ్ పరిసరాలు, తదితర అంశాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వైభవంగా కోన రామలింగేశ్వరుని రథోత్సవం

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని కోన పుణ్యక్షేత్రంలో వెలసిన కోన రామలింగేశ్వరస్వామి కళ్యాణం, రథోత్సవం కార్యక్రమాలు గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం శివ పార్వ తుల కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భక్తుల స్వామి నామస్మరణ మధ్య రథోత్సవం నిర్వహించారు. రథోత్సవంలో క్లాస్–1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. రాయలచెరువు వేదవతి, నాగేంద్ర, తదితరులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో వైసిపి మండల సీనియర్ నాయకులు బొంబాయి రమేష్ నాయుడు, ఉపసర్పంచి కాసా చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంగస్వామితాత రథోత్సవం

బొమ్మనహాల్ : మండలంలోని గోవిందవాడ గ్రామంలో వెలసిన రంగస్వామితాత రథోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిం చారు. గురువారం రంగస్వామితాత ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో కొలువుదీర్చి ఆలయ పురవీధుల గుండా ఊరేగించారు. రథోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆటల పోటీలు, రాతిదూలం పోటీలు నిర్వహించారు.

రేషన్‌షాపుల సర్దుబాటుపై ఆర్డీవో పర్యటన

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

రేషన్‌షాపుల సర్దుబాటుపై ప్రజల వినతి మేరకు గురువారం ఆర్డీవో వసంతబాబు, తహశీల్దార్ సుమతి మండలంలోని గోవిందయ్యదొడ్డి, అజ్జయ్యదొడ్డి గ్రామాల్లో పర్యటించారు. ఆర్డీవో ఆయా గ్రామాల్లో రేషన్‌షాపు ఆవశ్యకత, పంచాయతీల నుంచి గ్రామాల దూరం, ఆ గ్రామాల పరిధిలో ఉన్న రేషన్‌కార్డుల ఆధారంగా రేషన్‌షాపుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. వారి వెంట డిప్యూటీ తహశీల్దార్ శ్రీనాథ్, ఆర్‌ఐ నాగిరెడ్డి, నాగరాజు, మల్లికార్జున ఉన్నారు.

ఎస్‌ఆర్‌ఐటి విద్యార్థులకు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలు

ప్రజాశక్తి-శింగనమల

బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురం గ్రామం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ద్వారా నిర్వహించిన 2024–25 క్యాంపస్ రిక్రూట్మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా 13 మంది విద్యార్థులు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలు సాధించినట్లు కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. వీరు ఏడాదికి రూ. 3.6 లక్షల ప్యాకేజీ అందుతుందన్నారు. దీంతో ఇన్ఫోసిస్ ఫేజ్ 1, 2 ద్వారా మొత్తం 21 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డాక్టర్ ఎం.రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.బాలకృష్ణ, సిబ్బంది, అభినందించారు.

డ్వాక్రా రుణ మంజూరులో జాప్యం

ఏడు నెలలు ఆగాలంటున్న సిసి



ప్రజాశక్తి-యల్లనూరు

మహిళల సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం డ్వాక్రా మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. కొందరు అధికారుల నిర్లక్ష్యం, చేతివాటంతో ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. రుణాలు మంజూరు చేయకుండా మహిళా సంఘాల సభ్యులను వెలుగు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. మండల పరిధిలోని పెద్దమల్లేపల్లి గ్రామానికి చెందిన ఓ రెగ్యులర్ సిసికి యల్లనూరు ఇన్‌ఛార్జి సిసిగా బాధ్యతలు అప్పగించారు. డ్వాక్రా మహిళలు స్త్రీ నిధి రుణాల కోసం సంఘం తీర్మానంతో పాటు అన్ని దరఖాస్తులను ఆయనకు అందిస్తున్నా రుణ మంజూరులో జాప్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రుణ మంజూరుకు 7నెలలు ఆగాల్సిందే అంటూ డ్వాక్రా మహిళా సంఘం సభ్యులకు చెబుతున్నారు. ఇదేమిటని అడిగితే ఏవో కుంటి సాకులు చెప్పి తప్పించుకుంటున్నారని మహిళలు చెబుతున్నారు. మండలంలో డ్వాక్రా రుణాల మంజూరులో జరుగుతున్న జాప్యంపై సంబంధిత ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను బహిర్గతం చేయాలని మహిళా సంఘం సభ్యులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎపిఎం ముత్యాలప్ప స్పందిస్తూ రుణ మంజూరులో జాప్యం విషయం తమ దృష్టికి రాలేదని, మహిళా సంఘాల సభ్యులు ఏవైనా సమస్యలు తన దృష్టికి తెస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు : ఆర్డీవో



మట్టి తరలింపుపై ఆరా తీస్తున్న ఆర్డీవో కేశవనాయుడు

ప్రజాశక్తి-పుట్లూరు

అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో కేశవనాయుడు హెచ్చరించారు. మండలంలోని అరకటివేముల రెవెన్యూ గ్రామ పరిధిలోని కొండ నుంచి మెగా కంపెనీ వారు అక్రమంగా మట్టి తరలిస్తున్నారని కొండాపురం గ్రామానికి చెందిన ప్రకాష్‌నాయుడు మైనింగ్ అధికారి, ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఆర్డీవో, మైనింగ్ అధికారులు కలిసి కొండ వద్దకు చేరుకుని పరిశీలించారు. అనుమతులు ఉన్నంత మేరకే మట్టిని తరలించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని కంపెనీ వారికి సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ శేషారెడ్డి, మండల సర్వేయర్ శాంతి, వీఆర్వో రామకృష్ణ, ఎస్‌ఐ వెంకట నరసింహ, కొండాపురం సర్పంచి ఉన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచండి

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య పెంచాలని ఎంపిడిఒ అలివేలమ్మ టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. ప్రతి పంచాయతీలో ఫారం పాండ్లు తవ్వాలని, కూలీలకు రోజుకు కనీసం రూ. 300 కూలి పడేలా అవగాహన కల్పించాలన్నారు. ఇంకుడు గుంతలు, పశువుల షెడ్స్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్, బిఎఫ్‌టి, టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. సమావేశంలో ఎపిఒ నరేంద్ర, టిఎలు, ఎఫ్‌ఎలు, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా మోజులో పడొద్దు

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులు, యువత సోషల్ మీడియా మోజులో పడొద్దని మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ గూడపాటి దయాకర్ రావు సూచించారు. నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో గురువారం ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు ఆధ్వర్యంలో మోటివేషనల్ క్లాస్ నిర్వహించారు. డాక్టర్ దయాకరరావు మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాలో రీల్స్ చూస్తూ ఎక్కువ సమయం గడపడం కంటే కొత్త విషయాలు నేర్చుకోవడం మంచిదని సూచించారు. పాజిటివ్ ఆటిట్యూడ్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్, తదితర అంశాలను ప్రస్తావించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ మీ నుంచి మీ పేరెంట్స్ కోరుకునేది మీ మొహంలో చిరునవ్వు మాత్రమే.. దానిని ఎప్పటికీ చెరిగిపోనివ్వకుండా చూసుకోండి.. మీరు మీ లైఫ్‌లో ఒక లక్ష్యం పెట్టుకొని దాన్ని నెరవేర్చుకునే దిశగా వెళ్లాలని సూచించారు.

దళితులపై దాడిని ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి-ఉరవకొండ

దళితులపై దాడులు జరగకుండా రక్షణ కల్పించడంతో పాటు శాంతి భద్రతలను కాపాడాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నెరమెట్ల ఎల్లన్న, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి కోరారు. కూడేరు మండలంలోని కడదరగుంట గ్రామంలో దళితులపై జరిగిన దాడులను ఖండిస్తూ గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కూడేరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం బాధితులతో కలిసి అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నను కలిసి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ దళితులకు పోలీస్, రెవెన్యూ అధికారులు అండగా ఉండాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించొద్దని అసిస్టెంట్ కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు హనుమంతు, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేష్, రామాంజనేయులు, దళిత నాయకులు మీనుగ రామాంజనేయులు, ఎస్సీ, ఎస్టీ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, ఫోరం నాయకులు, బాధితులు కిష్టప్ప, వెంకటేశులు, రామచంద్ర, ఆదిలక్ష్మి, రమేష్, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్.. వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలోని తెలికి గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం ట్రాక్టర్‌ను ఢీకొన్న సంఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన వివరాలు.. గుంతకల్లు మండలంలోని పులిగుట్టపల్లి తండాకు చెందిన స్వామినాయక్(62) యాడికి మండలం పుప్పాలతండాలో బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. మార్గమధ్యలో తెలికి గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో స్వామినాయక్ అక్కడికక్కడే మతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని శ్రీపురం గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బుక్కరాయసముద్రం మండలంలోని కెకె.అగ్రహారం గ్రామానికి చెందిన వ్యక్తులు నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శనార్థం కసాపురం వెళ్లారు. తిరిగి ఆటోలో స్వగ్రామం వెళ్తుండగా శ్రీపురం వద్ద ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సరస్వతి, నరసయ్య తీవ్రంగా గాయపడగా గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

యాగంటి కోనేరులో వ్యక్తికి..

నంద్యాల జిల్లా బనగానపల్లి మండలంలోని యాగంటి శివ క్షేత్రంలో ఉన్న కోనేరులో దిగగా గుత్తి మండలానికి చెందిన ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనం కోసం యాగంటికి వెళ్లాడు. గురువారం ఉదయం శ్రీనివాసులు స్నానం చేయడానికి కోనేరులోకి దూకడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడికి అక్కడే ప్రథమ చికిత్స చేయంచిన కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అతడిని అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు.